క్లుప్తంగా

ఎమ్మెల్యే పరామర్శ


సర్పంచ్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న

కొడవలూరు : మండలంలోని పెమ్మారెడ్డి పాళెం గ్రామ సర్పంచ్ వల్లాపురం నవీన్ అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొంది ప్రస్తుతం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి పెమ్మారెడ్డిపాళెంలోని సర్పంచ్ నివాసానికి ఆదివారం వెళ్లి పరామర్శించారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, సౌత్ గండవరం సర్పంచ్ మారంరెడ్డి రంగారెడ్డి ఉన్నారు.

కామాక్షితాయికి బంగారు హారం బహూకరణ



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : జొన్నవాడలోని కామాక్షితాయి అమ్మవారికి ఎనిమిది గ్రాముల బంగారు హారాన్ని కొడవలూరు మండలం బ్రహ్మారెడ్డిపాళెం గ్రామానికి చెందిన రవి, రాధ బహూకరించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు దంపతులు, ఈఓ గిరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గొలగమూడి విద్యార్థులు



వెంకటాచలం: నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో సోమవారం నుంచి బుధవారం వరకు నిర్వహించనున్న రాష్ట స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు గొలగమూడిలోని ప్రభుత్వ ఆశ్రమ గిరిజన పాఠశాల విద్యార్థినులు ఎంపికయ్యారు. విద్యార్థినులు హారిక, నిఖితను ప్రధానోపాధ్యాయురాలు రాణీ అంబాజీ అభినందించారు.

నాగశిలలకు ప్రత్యేక పూజలు



పొదలకూరు : పట్టణంలోని రామలింగేశ్వర స్వామి దేవస్థాన ప్రాంగణంలో ఉన్న పురాతన నాగశిలలకు నాగిశెట్టి రమేష్ తన తల్లిదండ్రులు కొండయ్య–హైమావతమ్మల జ్ఞాపకార్థం షెల్టర్‌ను నిర్మించారు. ముందుగా నాగశిలలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రైతు సదస్సు జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 18న వైఎస్సార్ జిల్లాలో నిర్వహించనున్న రాష్ట్ర రైతు సదస్సును జయప్రదం చేయాలని జిల్లా రైతు సంఘ కన్వీనర్ షానవాజ్ పిలుపునిచ్చారు. సంతపేటలోని లోని సీపీఐ కార్యాలయంలో ఆదివారం రాష్ట్ర రైతు సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. ఏఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ మున్నా, సర్దార్, బాదుల్లా, షాజహాన్, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

మధుమేహ వ్యాధిపై అవగాహన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మధుమేహ వ్యాధిపై ఆదివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రముఖ మధుమేహ వ్యాధి నిపుణులు బైనముడి మనోహర్ మధుమేహ వ్యాధిపై అవగాహన కల్పించారు. అనంతరం మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆయనకు నివాళులర్పించారు. ఫ్రెండ్స్‌వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు హరిబాబునాయుడు, కార్యదర్శి రామ్మోహన్‌రెడ్డి, కోశాధికారి బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

ఆలయాలకు నవరాత్రి శోభ

- వేడుకగా దేవీశరన్నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం


ఇందుకూరుపేట : పల్లిపాడులో రాజరాజేశ్వరిదేవిగా అమ్మవారు

పొదలకూరు : పట్టణంలోని శ్రీకన్యకాపరమేశ్వరి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. నవరాత్రి మహోత్సవాలు ప్రారంభం రోజున ఉదయం 10 గంటలకు కలశస్థాపన, ప్రాణప్రతిష్ట చేశారు. ఉభయకర్తలుగా ఆదూరు వెంకటసుబ్బయ్య, ఆదూరు సునిల్ వ్యవహరించారు. సాయంత్రం లలితా సహస్రనామార్చన, త్రిశతి పూజలు చేశారు. కాగా అమ్మవారు కన్యకాపరమేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి మహోత్సవాల సందర్భంగా దేవస్థానాన్ని నిర్వాహకులు రంగురంగుల విద్యుద్దీపాలంకరణ చేశారు.

– పట్టణంలో శ్రీకామాక్షి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి పూజలు మొదలయ్యాయి. నవరాత్రులు పూర్తయ్యేంత వరకు అమ్మవారికి తెల్లవారుజామున 5.30 గంటలకు ప్రత్యేక అభిషేకాలు ఉంటాయని అర్చకుడు ప్రసాద్ స్వామి తెలిపారు.

భద్రకాళి అమ్మవారికి

మండలంలోని మొగళ్లూరు గ్రామంలో భద్రకాళి అమ్మవారి నవరాత్రి మహోత్సవాలను ప్రారంభించారు. మహిళా భక్తులు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థానంలో మహిళా భక్తులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో..

పట్టణంలోని శ్రీలక్ష్మి గోదా సమేత వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి మహోత్సవాలు ఆదివారం ప్రారంభమయ్యాయి. అమ్మవారు తొలిరోజున వీరలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.

వేడుకగా..

ఇందుకూరుపేట : మండలంలో దేవీశరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం వేడుకగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ పుణ్యక్షేత్రమైన గంగపట్నంలోని చాముండేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఉభయదాతలుగా రాముడుపాళెం గ్రామానికి చెందిన మావులూరు శ్రీధర్ రెడ్డి, మావులూరు శ్రీనివాసులురెడ్డి సోదరులు వ్యవహరించారు. ఆలయ అర్చకులు అనిల్ స్వామి, రామకృష్ణస్వామి, కిశోర్‌స్వామి ఆధ్వర్యంలో వేడుకలు జరిగాయి.

మైపాడులో..

ప్రముఖ పర్యాటక ప్రాంతమైన మైపాడులో కొలువైన అన్నపూర్ణాంబ సమేత ప్రసన్న విశ్వేశ్వరస్వామి ఆలయంలో కలశస్థాపన, పల్లకిసేవ కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయ అర్చకుడు బందారు ప్రభాకర్‌శర్మ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ఉభయకర్తలుగా మర్రి శ్రీనివాసులు, ఉషారాణి దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

కొత్తూరులో..

మండలంలోని కొత్తూరులో ఉన్న శ్రీలలితా మహేశ్వరి ఆశ్రమంలో పీఠాధిపతి రామాయణం మహేష్‌స్వామి ఆధ్వర్యంలో నవరాత్రి వేడుకలు ఘనంగా ప్రారంభమైంది.

పల్లిపాడులో..

పల్లిపాడులో కొలువైయున్న మీనాక్షి సమేత రామేశ్వర వేణుగోపాలస్వామి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరిదేవిగా దర్శనమిచ్చారు. స్థానికుడు తుమ్మల రాజమ్మ కుటుంబసభ్యులు ఉభయకర్తలుగా ఉన్నారు.

మండల కేంద్రంలో..

ఇందుకూరుపేటలో కొలువైన శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో దసరా ఉత్సవాల సందర్భంగా అమ్మవారికి పల్లకిసేవ జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు ఉదయగిరి వెంకటశేషాచార్యుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి గుణపాటి శివకుమార్‌రెడ్డి ఉభయకర్తగా వ్యవహరించారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు

మనుబోలు : శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలు పెద్ద చెరువు గట్టున వెలసిన గంగమ్మ తల్లికి ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అర్చకుడు సుబ్రహ్మణ్యంశర్మ గంగమ్మకు అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకాలంకరణ చేశారు. మంత్రోచ్చారణల నడుమ శాస్త్రోక్తంగా పూజలు జరిపించి తీర్థ ప్రసాదాలు వితరణ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు గంగమ్మను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉభయకర్తలుగా ముంగర రవీంధర్‌రెడ్డి–లలితమ్మ దంపతులు వ్యవహరించారు.


పొదలకూరు : మొగళ్లూరులో భద్రకాళికి పూజలు


పొదలకూరు : ప్రత్యేకాలంకరణలో కన్యకాపరమేశ్వరి అమ్మవారు


మనుబోలు : పూజలందుకుంటున్న గంగమ్మ తల్లి

వైభవంగా జెండా ఉత్సవం



మనుబోలు : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని మనుబోలులో జెండా ఉత్సవాన్ని ఆదివారం సాయంత్రం వైభవంగా నిర్వహించారు. మనుబోలులో అర్చకుడు ఫణీంద్రశర్మ ఆధ్వర్యంలో, కోదండరామపురంలో శ్రీనివాసులు, హరిశర్మ ఆధ్వర్యంలో మంత్రోచ్చారణల మధ్య ఆంజనేయస్వామి జెండాకు ప్రత్యేక పూజలు చేసి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆంజనేయస్వామి చిత్రపటంతో ఉన్న జెండాను ట్రాక్టర్‌పై ఉంచి గ్రామంలో ఊరేగించారు. అడుగడుగునా గ్రామస్తులు కొబ్బరికాయలు, పూలు పండ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పించి మంగళ హారతులు పట్టారు. యువకులు రంగులు చల్లుకుంటూ ఉత్సవం వెంట కేరింతలు కొట్టారు. మనుబోలులో కుడమల రాధయ్య, కోదండరామపురంలో గంధళ్ల కృష్ణయ్య అన్నపూర్ణమ్మ దంపతులు ఉభయకర్తలు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సిమెంటురోడ్డు పనులు ప్రారంభం



బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడ గ్రామం, పాత గిరిజనకాలనీలో సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను వైఎస్సార్‌సీపీ నేతలు ఆదివారం ప్రారంభించారు. దీంతో కాలనీ వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ మాట్లాడారు. ఏళ్లుగా తమ కాలనీలో సిమెంటు రోడ్డు లేదని, కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని సిమెంటురోడ్డు నిర్మాణానికి రూ.5 లక్షల నిధులు మంజూరు చేశారన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఎస్.బాలకృష్ణ, మాజీ సర్పంచ్ పి.మోహనమురళీకృష్ణ, ఎం.శివకుమార్, సురేష్, ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నరసింహకొండపై విశేష పూజలు



నెల్లూరు రూరల్: రూరల్ పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన నరసింహకొండపై ఉన్న శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఆదివారం ఆరంభమయ్యాయి. ఆదిలక్ష్మీదేవి సన్నిధిలోని విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. అమ్మవారు విశేషాలంకారంలో దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ఈఓ గిరికృష్ణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భక్తిశ్రద్ధలతో సుదర్శన హోమం

నెల్లూరు రూరల్: కొత్తూరు, శ్రామికనగర్‌లోని శ్రీభవాన్ వెంకయ్యస్వామి మందిరంలో జరుగుతున్న ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం సుదర్శన హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వెంకయ్యస్వామికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త ఎం నీరదమ్మ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

మెట్టసాగు ప్రశ్నార్థకం

- మండల పరిధిలో కానరాని వర్షం
- అక్టోబర్‌లోనూ ఎండల తీవ్రత
- పక్క మండలాల్లో తేలికపాటి వర్షాలు


దుక్కిపనులు చేపట్టి వదలివేసిన పొలం

పొదలకూరు : మండల పరిధిలో చినుకు జాడ కనిపించకపోవడంతో మెట్టసాగు ప్రశ్నార్థకంగా మారింది. అక్టోబర్ మాసం గడిచిపోతున్నా వర్షసూచన లేకుండాపోయిందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణంగా ఈ పాటికే మెట్టరైతులు ఊపిరిసలపని విధంగా మినుము, పెసర, కంది, పచ్చిశనగ, పొద్దుతిరుగుడు పంటల సాగులో ఉంటారు. అయితే స్వల్పంగా దుక్కిపనులు పూర్తి చేసిన రైతులు ధైర్యం చేసి విత్తనాలను చల్లకుండానే వదిలేస్తున్నారు. ఈనెల 20 నుంచి వర్షసూచన ఉందని వాతావరణ శాఖ వెల్లడిస్తోంది. పక్క మండలాల్లో తరచుగా వర్షపాతం నమోదు అవుతున్నా పంటల సాగుకు పనికిరావడం లేదు. కండలేరులో 11 టీఎంసీలు, సోమశిలలో 20 టీఎంసీల నీటి నిల్వ ఉంది. తోటల్లోని బోర్లలో భూగర్భజలాలు ఆశించిన స్థాయిలో ఉన్నా వర్షాలు కురవకుంటే పరిస్థితి తారుమారు అవుతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

స్వల్పంగా..

గతంలో సుమారు 10 వేల ఎకరాల పైబడి ప్రతిఏటా ఖరీఫ్‌లో రైతులు మెట్టపంటల సాగు చేపట్టేవారు. అయితే అతివృష్టి, అనావృష్టి కారణంగా రైతులు పప్పుధాన్యాల సాగును గణనీయంగా తగ్గించారు. ఫలితంగా రైతులు వెయ్యి ఎకరాల్లోపే మినుము, పెసర పంటలను సాగు చేసేవారు. ఇప్పుడు ఆ సాగు కూడా లేకుండాపోయింది. లీజుకు పొలాలు తీసుకుని సాగు చేయకుండా సొంత పొలాల్లోనే మినుము, పెసర పంటల సాగు చేస్తున్నారు.

అధ్వానంగా వర్షపాతం

ఈ ఏడాది జూన్ నుంచి అక్టోబర్ వరకు వర్షాపాతాన్ని పరిశీలిస్తే అధ్వానంగా ఉంది. జూన్‌లో సాధారణ వర్షపాతం 54.0 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 30.6 మి.మీ, జూలైలో 86.9 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 6.0 మి.మీ, ఆగస్టులో 86.0 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 28.6 మి.మీ, సెప్టెంబర్‌లో 110.0 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 60.8 మి.మీ, అక్టోబర్‌లో 233 మి.మీ నమోదు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు వర్షపాతం నమోదు కాలేదు. గత నెలలో కొంత ఆశాజనకంగా వర్షపాతం నమోదైంది.

నేడు ముత్తుకూరుకు మంత్రి కాకాణి రాక

ముత్తుకూరు : రాష్ట్ర వ్యవసాయ–సహకార శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి సోమవారం ఉదయం 9 గంటలకు ముత్తుకూరుకు వస్తారని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు మెట్టా విష్ణువర్ధనరెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు నూతనంగా ఏర్పాటు చేసిన వైఎస్సార్‌సీపీ కార్యాలయాన్ని మంత్రి ప్రారంభిస్తారని వెల్లడించారు. అనంతరం నారికేళపల్లిలో శ్రీమాతమ్మ ఆలయంలో జరిగే విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో మంత్రి పాల్గొంటారన్నారు.

నేడు రేగడిచెలికలో ‘జగనన్న ఆరోగ్య సురక్ష’

కొడవలూరు : మండలంలోని రేగడిచెలిక గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై శిబిరాన్ని ప్రారంభిస్తారన్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే శిబిరాన్ని సచివాలయ పరిధిలో ఆరోగ్య సమస్యలున్న వారు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఇందుకూరుపేట : నరసాపురం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఇండస్ట్రీయల్ విద్యుత్ సరఫరాకు సోమవారం ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ నరసింహ ఆదివారం తెలిపారు. తిరిగి కరెంటు సరఫరా యథా ప్రకారం కొనసాగుతుందన్నారు.

పోలేరమ్మ సేవలో ఎమ్మెల్యే ప్రసన్న


ఆశీర్వచనం తీసుకుంటున్న ఎమ్మెల్యే ప్రసన్న


కొడవలూరు : మండలంలోని పెయ్యలపాళెంలో పోలేరమ్మ దేవస్థానం నిర్మించి 41 రోజులు పూర్తి కావడంతో ఆదివారం జాతర నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి సారె సమర్పించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామస్తులంతా ఐక్యంగా ఉండి అమ్మవారికి జాతర నిర్వహించుకోవడం శుభపరిణామమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గంధం వెంకటశేషయ్య, ఆలయ దాత పెనాక సునీలమ్మ, పార్టీ నాయకులు పెనాక గోపినాథ్‌రెడ్డి, పెనాక నాగ శ్రీనివాసులురెడ్డి, సుభాష్‌రెడ్డి, కర్తం సుబ్బారెడ్డి, పెయ్యల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు అబ్దుల్ కలామ్


కలామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆశ్రమ సభ్యులు, విద్యార్థులు

ఇందుకూరుపేట : మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ నేటి యువతకు ఆదర్శప్రాయులు అని పినాకిని సత్యాగ్రహ గాంధీ ఆశ్రమ కోర్ కమిటీ సభ్యురాలు గంపల మంజుల అన్నారు. అబ్దుల్ కలామ్ జయంతి వేడుకలను మండలంలోని పల్లిపాడులో ఉన్న గాంధీ ఆశ్రమంలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కలామ్ ఎంత గొప్పగా రాణించినా నిరాడంబర జీవితాన్ని గడిపారన్నారు. కలామ్ జీవితం మొత్తం విశ్రాంతి లేకుండా పనిచేశారని మంజుల కొనియాడారు. కార్యక్రమంలో రాపూరు ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు పీవీ శేషయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి దేవస్థానం కార్యవర్గ ఎన్నిక


నూతనంగా ఎన్నికైన కార్యవర్గ బాధ్యులు

పొదలకూరు : పట్టణంలోని కామాక్షి సమేత రామలింగేశ్వరస్వామి(శివాలయం) ప్రాంగణంలో ఉన్న అయ్యప్పస్వామి దేవస్థానం నూతన కార్యవర్గాన్ని ఆదివారం గ్రామపెద్దలు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా శివాడ పరంధామిరెడ్డి, ముత్తు స్వామి, అధ్యక్షుడిగా మొలబంటి శేఖర్, ఉపాధ్యక్షలుగా కోటపాటి కృష్ణంనాయుడు, అల్లూరు రమణయ్య, దాసినేని ప్రసాద్, సెక్రటరీగా చొప్పా వెంకటేశ్వర్లు, జాయింట్ సెక్రటరీలుగా ఇండ్ల రవీంద్ర, సిరిగిరి ఓబులేసు, కోశాధికారిగా అడపాల మస్తాన్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా అయితా రవివర్మ, విరుమాండి కృష్ణలను ఎంపిక చేశారు. మారు వెంకటరామిరెడ్డి, చిర్రా రమణారెడ్డి నూతన కార్యవర్గం చేత ప్రమాణస్వీకారం చేయించారు.

వైభవంగా కలశ స్థాపన


కలశ స్థాపనకు పెన్నా జలాలను తీసుకొస్తున్న అర్చకులు

బుచ్చిరెడ్డిపాళెం రూరల్ : మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి ఆలయంలో ఆదివారం కలశస్థాపన వైభవంగా జరిగింది. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణలతో శాస్త్రోక్తంగా కలశస్థాపన కార్యక్రమం గావించారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంచిపెట్టారు.

అమ్మవారి సేవలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి

ఎస్పీ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి కామాక్షితాయిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నప్రసాద భవనం, విరాళ స్వీకరణ కేంద్రాన్ని సందర్శించారు. ఆలయ అభివృద్ధి పనుల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో దేవస్థానం చైర్మన్ పి.సుబ్రహ్మణ్యం నాయుడు, దేవదాయ ధర్మాదాయశాఖ అధికారి జె.శ్రీనివాసరావు, ఆలయ ఈఓ గిరికృష్ణ, జిల్లా అర్చక సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.


ఆలయ ఆవరణలో ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి కుటుంబ సభ్యులు